ప్రజాశక్తి
శనివారం 13 జనవరి 2024 5 శ్రీ సత్యసాయి





కళశాలలతో పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

రాజకీయ సందిగ్ధంలో....

శింగనమల



◆ వైసిపి, టిడిపి రెండింటిలోనూ గందరగోళం

◆ ఖరారవని అభ్యర్థులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులెవరన్న సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది. అటు అధికార వైసిపిలోనూ...ఇటు ప్రతిపక్ష టిడిపి రెండింటిలోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన ఈ ప్రాంతంలో రెండు పార్టీల నుంచి ఈసారి మార్పులుంటాయని ప్రచారమూ నడుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేగా వైసిపి నుంచి జొన్నలగడ్డ పద్మావతి ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆమెకు ఈసారి అవకాశం లేదని అధిష్టానం ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. జొన్నలగడ్డ పద్మావతి భర్త అలూరు సాంబశివారెడ్డి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుల్లో ఒకరుగా చెప్పుకుంటూ ఉంటారు. సర్వేల్లో తగినంత సానుకూలత లేనందున మార్పు చేయాలని అధిష్టానం నిర్ణయించింది. గత వారంలో ఎమ్మెల్యే దంపతులు అక్కడే ఉండి టికెట్టు కోసం వారి ప్రయత్నాలు చేసుకున్నప్పటికీ ఆశించిన ఫలితం దక్కలేదు. ఈ క్రమంలోనే జొన్నలగడ్డ పద్మావతి సోషియల్ మీడియాలో సాగునీటి సమస్యపై మాట్లాడటం, అందులో వైసిపి ప్రజాప్రతినిధుల గురించి ప్రస్తావించడం పెద్ద దుమారమే రేపింది. విజయవాడలో ఈ అంశంపై మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ వివరణిచ్చుకునే పరిస్థితి నెలకొంది. అనంతరం జొన్నలగడ్డ పద్మావతి దంపతులు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలసిన ఫోటోలు మీడియాకు అందజేశారు. పార్టీ కోసం పనిచేస్తామన్న ప్రకటన కూడా చేశారు. ఈ క్రమంలో కొత్త అభ్యర్థిని సూచించే బాధ్యత కూడా వీరిపైనే ఉంచినట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో వైసిపి సర్వే బృందాలు ఎవరైతే బాగుంటుందని ఆరా తీసే పనిలో ఉన్నాయి. ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు పెద్దఎత్తున ప్రచారం నడుస్తున్నప్పటికీ ఎంపికపై కసరత్తు పూర్తవలేదు. మూడో జాబితా విడుదల సమయానికి అయినా ఈ నియోజకవర్గంపై వైసిపిలో స్పష్టత వస్తుందా లేక మరో జాబితా వరకు వేచి చూడాల్సి ఉంటుందా అన్నది చూడాల్సి ఉంది.

తెలుగుదేశం పార్టీలోనూ అయోమయమే..

ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలోనూ అయోమయమే కొనసాగుతోంది. 2019లో ఇక్కడ టిడిపి ఓటమి చెందింది. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన బండారు శ్రావణినే కొంతకాలం నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా నియమించారు. ఇక్కడి నేతలకు, ఈమెకు మధ్య పొగసకపోవడంతో విభేదాలు తారా స్థాయిలో చెలరేగాయి. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జీని కాదని టుమెన్ కమిటీ పేరుతో ఇద్దరు నాయకులను తెరపైకి తెచ్చారు. వారి ఆధ్వర్యంలో అప్పుడప్పుడు కొన్ని కార్యక్రమాలు నిర్వహించారు. ఆ ఇద్దరు నాయకులు కూడా ఓసి సామాజిక తరగతికి చెందిన వారు కావడం గమనార్హం. ఎస్సీ రిజర్వు నియోజకవర్గం కావడంతో ఎస్సీ సామాజిక తరగతి నుంచి ఇన్‌ఛార్జీని నియమించాల్సి ఉంది. ఇప్పటికీ దీనిపై టిడిపిలో స్పష్టత రాలేదు. గతంలో పోటీ చేసి ఓటమి చెందిన బండారు శ్రావణినే మళ్లీ నియమిస్తారా లేక కొత్త వారిని నియమిస్తారా అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. మరోవైపు మాజీ ఎపిసిసి అధ్యక్షులు సాకే శైలజనాథ్ టిడిపిలో చేరుతారన్న ప్రచారమూ ఉంది. చేరితే ఆయనకే టిక్కెట్టు ఇస్తారా లేదా అన్నది కూడా చూడాల్సి ఉంది.

సమస్యలు పరిష్కరించకుంటే..

చలో విజయవాడకు సిద్ధం

◆ ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తాం

◆ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

◆ కోటి సంతకాల సేకరణ ప్రారంభం



సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీలు న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే త్వరలో చలో విజయవాడను నిర్వహించి, ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు తెలిపారు. అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా అంగన్వాడీలు కళశాలను ఎత్తుకుని పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. సమ్మెకు మద్దతుగా ప్రజలతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెవివి కార్యదర్శి డాక్టర్ ఈటి రామ్మూర్తి సంతకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని గత 32 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. శాంతియుత మార్గంలో అంగన్వాడీలు పట్టుదలతో నెలరోజుల నుంచి సమ్మె నిర్వహిస్తున్నారన్నారు. భవిష్యత్తు ఉద్యమాలకు స్ఫూర్తిని ఇచ్చేలా అంగన్‌వాడీల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతిలోపు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు. కనీస వేతనం, గ్రాట్యుటీ, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, కోశాధికారి శిరీషా, సెక్టర్ లీడర్లు శైలజ, నాగమ్మ, విజయలక్ష్మి, గీతావాణి, భారతి, పద్మతో పాటు పెద్దఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

16న ప్రధాని రాక

నాసన్ కంపెనీ భవన సముదాయం ప్రారంభం

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16వ తేదీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి రానున్నారని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. పాలసముద్రంలో గల నాసిన్ కంపెనీ భవన సముదాయాలను ప్రధాని ప్రారంభిస్తారన్నారు. ప్రధాని పర్యటన ఖరారు కావడంతో నాసిన్ కంపెనీ ప్రాంతాన్ని కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డిలు శుక్రవారం పరిశీలించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవన సముదాయాలను పరిశీలించి, అక్కడి అధికారులతో మాట్లాడారు. ప్రధాని పర్యటన నేపథ్యంలోని జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలియజేశారు.

ఉపాధి ప్రజావేదికలో కనిపించని కూలీలు

అగళి : మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి ప్రజావేదిక సభలో కూలీలు కన్పించలేదు. జాతీయ సమగ్ర జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17 విడత కింద విడుదలైన రూ.3.41 కోట్లతో వివిధ గ్రామాలలో ఉపాధి కూలీలు పనిచేశారు. ఆ పనికి సంబంధించి వారంరోజుల పాటు అధికారులు సామాజిక తనిఖీలు నిర్వహించి తమ సర్వేలో తేలిన అంశాలను శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో ప్రవేశపెట్టారు. మొత్తం ఖర్చు అయిన దానిలో 11 పంచాయతీలకు కలిపి కేవలం రూ. 31 వేలు మాత్రమే రికవరీ చూపించారు. ఈ ప్రజావేదికలో పాల్గొన్న ఎంపీపీ రేణుక కామరాజు, కొందరు సర్పంచులు ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. చాలామంది దళారులు కూలీలను సమకూర్చుకుని, జెసిబి ద్వారా పనులు చేయించిఉపాధి పేరు ఉన్న కూలీల పేరు చెప్పుకొని డబ్బులు దండుకున్నారని పలువురు ఆరోపించారు. 2021 22 లో జరిగిన ఉపాధి పనులపై ఎక్కువగా అవకతవకలు జరిగాయని వాటిపై ఫీల్డ్ సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. దళారుల చేతికి ఉపాధి డబ్బులు దక్కకుండా ఉపాధి కూలీలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ విజయేంద్రప్రసాద్, ఏపీడీ లక్ష్మీనారాయణ, డీవీవో రమణారెడ్డి, ఏపీవో శివన్నచ ఎంపీడీవోతో పాటు ఎస్ఆర్‌పిలు, సిఆర్‌పిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

బత్తలపల్లి : గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికను తయారు చేసే నిమిత్తం ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజులు పాటు శిక్షణా తరగతులను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సాయిమనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను తయారు చేసేందుకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ స్థాయి అధికారులు శిక్షణకు హాజరు కావాలని ఆయన కోరారు.

నిరుద్యోగులకు మొండిచేయి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చి నిరుద్యోగులకు మొండి చేయి చూపారని తెలుగు యువత నాయకులు విమర్శించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి రోజున ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మోకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని ప్రగల్భాలు పలికారన్నారు. ఐదేళ్లు గడుస్తున్న రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనందున పలువురు యువకులు పెడదోవన వెళ్లి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రాన్ని అన్ని రకాలుగా భ్రష్టు పట్టించారని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో ఈ సైకో పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, కార్యదర్శి నరేష్ కుమార్ యాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ సురేంద్ర యాదవ్, పార్లమెంటు కార్యదర్శులు బళ్లారి సుధాకర్, సోమగట్ల మంజునాథ్, పుట్టపర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మురళి చౌదరి తదితరులు పాల్గొన్నారు

అందుబాటులో ఉంటా.. ఆదరించండి

ప్రజాశక్తి - రొద్దం

నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించాలని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ కోరారు. మండలంలోనితాడంగపల్లి, మోపర్లపల్లి, ఎం కొత్తపల్లి, గౌరాజుపల్లి, రొద్దకంపల్లి, నారా నాగేపల్లి, కనుమర,నాగిరెడ్డిపల్లి, బూచెర్ల,కొత్తూరు, లోచర్ల తదితర గ్రామాలలో ఆమె పార్టీ నాయకులతో కార్యకర్తలతో కలసి శుక్రవారం పర్యటించారు. నారానాగేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మఅక్కులప్ప, ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి నారాయణ రెడ్డి, మారుతి రెడ్డి, మండల కన్వీనర్ తిమ్మయ్య, అక్కులప్ప, సర్పంచులు సోమిరెడ్డి, నరేందర్ రెడ్డి, వీరేష్ , సి నారాయణ రెడ్డి, ఎన్ నారాయణరెడ్డి, మండలంలోని వివిధ పంచాయతీల సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తిని ప్రముఖ ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసి దేశ విదేశీయుల, పర్యాటకులు మరింత ఆకర్షించే విధంగా సౌకర్యాలు కల్పించాలని కడపల శ్రేయస్ రెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును శుక్రవారం రాష్ట్రపతి భవనంలో కలిసి పుట్టపర్తి గురించి వివరించారు. జాతీయ కార్యదర్శి కడపల శ్రీకాంత్ రెడ్డి తనయుడు, శ్రేయస్ రెడ్డి సతీ సమేతంగా వెళ్లి మర్యాదపూర్వకంగా రాష్ట్రపతిని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. పుట్టపర్తి ,లేపాక్షి ,పెనుగొండ, కదిరి తిమ్మమ్మ మర్రిమాను తదితర పర్యాటక ప్రాంతాలను అభివృద్ధిపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

'పురం' సమస్యలను ముఖ్యమంత్రికి వివరిస్తా...

హిందూపురం : హిందూపురం పట్టణంతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న సమస్యలను ముఖ్యమంత్రికి వివరించి, ప్రత్యేక నిధులను మంజూరు చేయించి, ఒక ప్రణాళికతో అభివృద్ధి చేస్తామనిమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని ఈడి ఫంక్షన్ హాల్‌లో లైఫ్ వరర్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్ కుమార్ ఆద్వర్యంలో మంత్రి పెద్ది రెడ్డితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వివిధ వర్గాలకు చెందిన వారు వినతి పత్రాలు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతు సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిజిఎస్ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర కుమార్, చైతన్య గంగిరెడ్డి, శ్రీరాములు, చందన్, ఎస్ఎఫ్ఐ బాబావలితో నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ముగ్గులు గ్రామీణ సంస్కృతికి ప్రతిరూపాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రంగవల్లులు గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబాలు అని ఎస్పీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణంలో పోలీస్ కుటుంబాలకు చెందిన మహిళలకు ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణంలో జరిగిన ముగ్గుల పోటీలను ఎస్పీ దంపతులు ప్రారంభించారు. మహిళా కానిస్టేబుల్ పద్మశ్రీ మొదటి బహుమతి, మంజుల రెండో బహుమతి, హేమలత మూడో బహుమతి దక్కించుకున్నారు. వీరికి ఎస్పీ దంపతులు మీదుగా బహుమతులను అందజేశారు. అదేవిధంగా ఈ పోటీలలో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అదేవిధంగా డిపిఒ సిబ్బందికి నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన అందరికీ ఎస్పీ దంపతులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ విజయ్ కుమార్, ఏవో సుజాత, ఆర్ఐలు టైటాస్, నారాయణ, సిసి రాఘవేంద్ర, ఆర్ఎస్ఐ రాజు, ఎఎస్ఐ శ్రీరాములు, డిపిఒ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




శెట్టిపల్లిలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి

చిలమత్తూరులో మంత్రి పర్యటన

వినతులు ఇచ్చేందుకు అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు మండల పరిధిలోని వీరాపురం, దేమకేతేపల్లి, టేకులోడు, శెట్టిపల్లి, కోడూరు, కొడికొండ పంచాయతీలో వైసిపి రాయలసీమ ఇన్‌ఛార్జి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి శుక్రవారం పర్యటించారు. పంచాయతీ కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించి ప్రసంగించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి పర్యటన సందర్భంగా ఆయా గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా నాయకులు అడ్డుకున్నారు. గ్రామాలకు రోడ్డు వేయాలని వినతిపత్రం ఇద్దామని వెళ్లిన వారిని స్థానిక నేతలు కలవనివ్వలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అసంతప్తి వ్యక్తం చేశారు. 'మీకు చెప్పినా పరిష్కరించరు.. పెద్దాయన దష్టికీ తీసుకెళ్లనివ్వరు.. ఇలా అయితే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి'.. అంటూ గ్రామస్తులు నాయకులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజక ఇన్‌ఛార్జి దీపిక, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, జడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ, ఆగ్రోఛైర్మన్ నవీన్ నిశ్చల్, మధుమతిరెడ్డి, మండల కన్వీనర్ రాజారెడ్డి, ఎంపిపి పురుషోత్తమరెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, నాగరాజు సర్పంచులు తిరుమలేష్, చామంతి, మురళీ, జనార్ధన్ రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సమస్యలను తెలిపేందుకు గ్రామస్తులు తయారు చేసుకున్న వినతిపత్రం

కనీస సౌకర్యాలు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న పేదలు, నాయకులు

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

మండలంలోని పాలసముద్రం గ్రామం వద్ద సర్వే నంబర్ 125లో గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపు 300 మంది మూడు నెలల నుండి గుడిసెలు వేసుకుని జీవనం చేస్తున్నారని ఆ ప్రాంతంలో కనీస సౌకర్యాలు కల్పించాలని గుడిసెలు వేసుకుకున్న పేదలు కోరారు. ఈ మేరకు వారు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాల సాధన కమిటీ అధ్యక్షురాలు అశ్వినితో కలసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సర్పంచి గంగప్పకి అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పెద్దన్న మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు 2 నెలల క్రితం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారన్నారు. పాలసముద్రం పంచాయతీ జాతీయ రహదారికి దగ్గరగా ఉండడం, జాతీయ సంస్థలు (నాసన్ , బెల్) నిర్మాణాలు జరుగుతుండడంతో సొంత ఇల్లు లేని నిరుపేదలు వేలాది రూపాయలు బాడుగలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీరిలో ఎక్కువమంది ఎస్సీ , బీసీ , మైనారిటీలు ఉన్నారని చెప్పారు. గత్యంతరం లేక ఇబ్బందులు ఎదురైనా గుడిసెలు వేసుకుని నివాసం ఉన్నారని, సర్పంచి జోక్యం చేసుకుని గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇంటిస్థలాల పట్టాలు ఇచ్చేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అదేవిదంగా తక్షణం కనీస వసతులు (విద్యుత్, నీటివసతి) ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య,ఉపాధ్యక్షులు వెంకటేశులు, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, ఇళ్ల స్థలాల సాధన కమిటీ సభ్యులు వెంకటలక్ష్మమ్మ, వజీర్, లక్ష్మీనారాయణ, ఓంకార్, శాతాజ్, గీత, భాగ్యమ్మ, అంజలి, నాగలక్ష్మి , అశ్వర్థమ్మ, ప్యారిమా, ఆసియా, మున్ని, ముబీనా, నూరాన్ బీ, స్వర్ణ లత, గంగమ్మ, అంజనప్ప, శామీర్, రత్నమ్మ, వెంకట్రాముడుతో పాటు పలువురు పేదలు పాల్గొన్నారు.

జగన్‌ది నమ్మినవారిని ముంచే నైజం : కందికుంట

ప్రజాశక్తి కదిరి టౌన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిది నమ్మిన నాయకులను ముంచే నైజం అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. జాతీయ యువత దినోత్సవం సందర్భంగా ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యువత వివేకానంద ఆశయాలను ఆచరించి ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. 'మా ఎస్సీలు, మా ఎస్టీలు, మా బీసీలు అని గొప్పలు చెప్పే జగన్మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలకు చెందిన వారి పార్టీ నాయకులను బంగాళాఖాతం లోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. ప్రతిసారి ఎన్నికలు వచ్చేటప్పుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసలు రూపం బయటపడుతుందని అన్నారు.కొంతమంది వైసీపీ ఎమ్మెల్యేలు అన్నదమ్ములను అడ్డుపెట్టుకొని రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు కూడా వారి స్వార్థం కోసం రాకుండా చేశారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఇర్ఫాన్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

193 చెరువులను నింపడమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులకు నీరు అందించడమే ధ్యేయంగా నియోజకవర్గ వ్యాప్తంగా డాక్టర్ వైఎస్ఆర్ విజయసంకల్పయాత్ర చేపట్టనున్నామని శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైసీపీ స్థానిక కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 36 విడుదల చేస్తూ రూ. 834 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం ఆ చెరువులకు నీరు అందించడమే లక్ష్యంగా ఈనెల 19న మండలంలోని చెర్లోపల్లి గ్రామం నుండి ప్రారంభమయ్యే పాదయాత్ర నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. హంద్రీనీవా నుండి నీరు ఈ ప్రాంతానికి తెచ్చిన ఘనత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఆ కాలువ ద్వారా నియోజకవర్గంలో 193 చెరువులను నింపుతామన్నారు.కొందరు స్వపక్ష, ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్ఆర్ విజయసంకల్ప పాదయాత్రలో నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, లక్ష్మీనారాయణ రెడ్డి, పుడా ఛైర్మన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, కౌన్సిలర్ చెరువు భాస్కర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కన్వీనర్లు నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని వినతి

కదిరి అర్బన్ : హిందూపురం పార్లమెంటు టిడిపి అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని బంగారు కృష్ణమూర్తి పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఇటీవల టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి తన విన్నపాన్ని వివరించారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు బంగారు కృష్ణమూర్తి తెలిపారు. పార్లమెంట్ పరిధిలో ఎన్నో సేవా కార్యక్రమాలు తాను చేశానన్నారు. తనకు అవకాశం ఇస్తే ప్రజలకు సేవకునిగా ఉంటూ పార్టీకి అధిష్టానానికి విధేయుడిగా ఉంటానని కోరినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం పరిశీలించి ఒకసారి అవకాశం ఇస్తే బాగుంటుందని ఆయన అభిమానులు అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

వేతనాలు ఇచ్చి ఆదుకోండి...

ప్రజాశక్తి-హిందూపురం

తమకు వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని క్లాప్ వాహనాల డ్రైవర్లు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాల్లో కోత విధించడమే కాకుండా ప్రతి నెల వేతనాలు సైతం ఇవ్వడం లేదన్నారు. పండుగ పూట అయిన తమ వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని శుక్రవారం సాయంత్రం క్లాప్ ఆటో డ్రైవర్లు కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో మొరపెట్టుకున్నారు. తమ చేతుల్లో లేదని కమిషనర్ చెప్పారు. వెంటనే సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ లో మాట్లాడారు. వారు ఈ నెలాఖరుకల్లా వేతనాలు ఇస్తామని చెప్పారు.

మంత్రిని కలిసిన వాల్మీకి శంకర్

కొత్తచెరువు : రాష్ట్ర విద్యుత్ గనుల శాఖ మంత్రి రామచంద్రారెడ్డిని స్థానిక వైసిపి నాయకులు వాల్మీకిశంకర్ కలిశారు. చిలమత్తూరు మండలం శెట్టిపల్లి గ్రామంలో పర్యటిస్తున్న మంత్రిని వాల్మీకి శంకర్ కలిసి పుట్టపర్తి నియోజకవర్గంలో వైసిపి పరిస్థితుల గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పార్టీ విజయం కోసం పనిచేయాలని మంత్రి వాల్మీకిశంకర్‌కు సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

సోమందేపల్లి : మండల పరిధిలోని తుంగోడు గ్రామ సచివాలయంలో శుక్రవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి ఓంకార్, హిందూపురానికి చెందిన కంటి వైద్య నిపుణులు భాస్కర్ రెడ్డి, శివకుమార్ సుమారు మూడు వందల మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సావిత్రి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి : మండలంలోని శ్రీరంగరాజు పల్లి లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల వైద్యులు డాక్టర్ స్వరూపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుని మెరుగైన వైద్యం పొందాలన్నారు. . అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు కూడా అందజేస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఆఫ్తాబ్ రూబీ, నాగ సింధు, సిహెచ్‌ఒ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

బత్తలపల్లి : కుష్టు వ్యాధిపై ఎలాంటి అపోహలు తలెత్తకుండా అవగాహన కల్పించాలని లెప్రసీ, అందత్వ నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 12వ తేదీ వరకు జరుగుతున్న లెప్రసీ వ్యాధి నిర్ధారణ సర్వే కార్యక్రమం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేలో గుర్తించిన అనుమానిత కేసుల వివరాలు, వాటి నిర్ధారణను పరిశీలించారు. ప్రస్తుతం మండలంలో చికిత్స పొందుతున్న మూడు కేసుల వివరాలు తెలుసుకున్నారు. వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స అందివ్వడం ద్వారా అంగవైకల్యం బారిన పడకుండా కాపాడగలమని సూచించారు. వీటిపై ఎలాంటి ఆపోహలకు పోకుండా అందరూ వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు గంగిరెడ్డి, రామకృష్ణ, సిహెచ్‌సి రాజశేఖర్, హెల్త్ సూపర్వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలోని పొట్లమర్రి, ఓబుళాపురం, కోడేకండ్ల గ్రామాలలో రైతులు సాగు చేసిన కంది పంటలో ధర్మవరం ఏడీఏ క్రిష్ణయ్య పర్యవేక్షణలో అధికారులు పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. గ్రామంలోని పోతలయ్య సాగు చేసిన కంది పంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఏఎపీ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ, విఎస్ఏ ముత్యాలప్ప, విహెచ్‌పి ఉపేంద్ర, ఏఈవో ఉపేంద్రరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి



సమ్మెలో పాల్గొన్న ఇంతియాజ్, తదితరులు



పెనుకొండలో ఎస్మా జీవో ప్రతులను నీటిలో వదులుతున్న పఅంగన్వాడీలు



కదిరిలో గడ్డి తింటూ నిరసన

ప్రజాశక్తి - బత్తలపల్లి

అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తన నిర్లక్ష్యం వీడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. బత్తలపల్లి ,తాడిమర్రి మండలాల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె కొనసాగుతుందని చెప్పారు. బత్తలపల్లిలో జగనన్నకు చెబుదాం సంతకాల సేకరణ చేపట్టారు. మొదటి సంతకం ఆంధ్ర ప్రదేశ్ పౌరహక్కుల సంఘం నాయకులు జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు చేశారు. మెదటి రోజు 207 సంతకాల సేకరణ జరిగినట్లు అంగన్వాడీ యూనియన్ నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్ , తాడిమర్రి రైతు సంఘం నాయకులు నారాయణ , సిఐటియు వాసంతి, రజియా, మండల నాయకులు వసంత, రజిత, కృష్ణవేణి సున్నిబేగం జయసుధ, అరుణ తదితరులు పాల్గొన్నారు

పరిగి : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె 32వ రోజు కొనసాగింది. ఇందులో భాగంగా అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి వైఎస్ఆర్ కూడలిలో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, సిఐటియు ఫ్రీ కాట్ వర్కర్స్ అండ్ యూనియన్ నాయకులు శివ, సెక్టార్ నాయకురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 32 రోజులుగా నిరవధిక సమ్మె చేపట్టిన అంగన్వాడీలె శుక్రవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా కోటి సంతకాల సేకరణను చేపట్టారు. కోటి సంతకాల సేకరణ చేసి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో విన్నవిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా మొదటి సంతకం డాక్టర్ షేక్ మహమ్మద్ దౌల చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : అంగన్వాడీలపై ప్రయోగించిన జీవో -2 ఎస్మాచట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంగన్వాడీలు జీవో కాఫీలను నీళ్లలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమ 11 డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు జయమ్మ, బావమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, అనిత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి మహదేవమ్మ మాట్లాడుతూ వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మీదేవి, వఅంగన్వాడీలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : తమ సమస్యలు ప్రభుత్వానికి కన్పించడం లేదా అని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా అంగన్వాడీలు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీయూనియన్ నాయకులు మాబున్నీసా, సుజాత, శారద, లక్ష్మీదేవి, చంద్రకళ, సుశీల, రామలక్ష్మమ్మ, భారతి, రాధమ్మ, నాగరత్నమ్మ, మాధవి, సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్ పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక తహశీల్దార్‌కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ప్రభుత్వం మొండి వైఖరి వీడే వరకు సమ్మె కొనసాగుతుందని అంగన్వాడీలు తెగేసి చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మహబూబ్ ఖాన్, యూనియన్ లీడర్లు నాగవేణి, అనసూయమ్మ, మంజుల చంద్రకళ నాగరత్నమ్మ స్వారక్క తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : అంగన్వాడీల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మద్దతు పలికారు. అంగన్వాడీల శిబిరంలో కూర్చొని సంఘీభావం తెలిపారు. సమ్మె నిర్వహణ కోసం అంగన్వాడీలకు 50 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు బాబు, నాగప్ప, వెంకటేశు, పోతలయ్య, రాజా, చాంద్‌బాషా, సిపిఐ చల్ల శ్రీనివాసులు, అంగన్వాడీలు రజియా తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మాదిగలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సాయి అరామంలో బేకరీ గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు, ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు బిసిఆర్ దాస్, కేపీ నారాయణస్వామి, నాగరాజు, సామ్రాట్ మధు తదితరులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఆరు లక్షల మంది మాదిగలు ఉన్నారని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలన్నారు ఈనెల 31న అనంతపురంలో జరిగే మాదిగల ఆత్మీయ విజయవంతం చేయాలని మాదిగ సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, కంబదూరు జెడ్పీటీసీ నాగరాజు, ఎస్‌టిడి నరసింహులు, రామాంజనేయులు, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

14న సంక్రాంతి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లా కేంద్రంలో ఈనెల 14న సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ రెండు పార్టీల ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక దుర్గమ్మ గుడి వద్ద ఈ పోటీలు ఉంటాయన్నారు. న్యాయ నిర్ణీతల ద్వారా గెలుపొందిన మహిళలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామన్నారు. పాల్గొన్న మహిళలందరికీ చీరలు, జాకెట్ పీసులు అందజేస్తామన్నారు. పట్టణ మహిళలు ఈ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్ కళ్యాణ్, అల్లాడి జయరాం, నారాయణస్వామి, చిన్నప్ప నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


హత్యకేసులో నిందితులు అరెస్టు

ముదిగుబ్బ : ఆస్తికోసం వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితులుగా ఉన్న హతుడి భార్య, కొడుకు, కుమార్తె మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ యతీంద్ర తెలిపారు. మండల పరిధిలోని నాగారెడ్డిపల్లికి చెందిన బలం పాపిరెడ్డి అనే వ్యక్తి నవంబర్ నెలనుంచి కన్పించలేదని అతని అన్న కృష్ణారెడ్డి జనవరి నెలలో పట్నం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఈ నేపథ్యంలో హత్యకేసు దర్యాప్తులో భాగంగా అనుమానితులను విచారిస్తుండగా, హత్యకు కారకులైన వారు భయపడి స్థానిక వీఆర్వో ద్వారా లొంగిపోయారన్నారు, ఈమేరకు నిందితులపై నమోదు చేసి రిమాండ్ పంపినట్లు సిఐ చెప్పారు. నాగారెడ్డిపల్లికి చెందిన పాపిరెడ్డి పేరిట కొంత భూమి ఉండగా అందులో కొంత భూమిని కుమార్తె పేరిట మార్చాలని, మరికొంత భూమిని విక్రయించి ఇంటి నిర్మాణం చేసిన అప్పులను తీర్చాలని పాపిరెడ్డి భార్య లక్ష్మీదేవి, కుమారుడు వెంకటేశ్వర్ రెడ్డి, కుమార్తె తేజవతి ఒత్తిడి చేయగా అందుకు పాపిరెడ్డి తిరస్కరించాడన్నారు. ఈ నేపథ్యంలో పాపిరెడ్డి రోజు మద్యం తాగి వచ్చి వేధిస్తుండటంతో పాపిరెడ్డి అడ్డు తొలగించడానికి భార్య కొడుకు కుమార్తె కలసి అదే గ్రామానికి చెందిన శివారెడ్డి, జయ రాములు అనే వ్యక్తులకు సుమారు రూ.1.70 లక్షలు సొమ్ము అందించి హత్య చేయించడానికి ఒప్పందం చేసుకున్నారన్నారు, ఇందులో భాగంగా శివారెడ్డి, జయరాములు మద్యం తాగడానికి రావాలని పాపిరెడ్డిని ఒప్పించి గ్రామ సమీపంలోని మద్దిలేరు వాగు వద్ద ఉన్న చీకిరేవు కుంట వద్దకు తీసుకొని వెళ్లి బండరాయితో కొట్టి హత్య చేశారన్నారు. అనంతరం గుట్టపై గుబురుగా ఉన్న గడ్డిలో పూడ్చి పెట్టారన్నారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు హత్య జరిగిన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపినట్లు సిఐ చెప్పారు. ట్రయినీ డీఎస్పీ, పట్నం ఎస్ఐ, సిఐ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

నంబులపూలకుంట : మండల పరిధిలోని టిఎన్ పల్లి పంచాయతీ అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రమణ తెలిపారు. తమకు అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి 27 మంది పేకాట జూదరులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుండి రూ.3,24,900 నగదు, 14 ద్విచక్రవాహనాలు, 21 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు, సంక్రాంతి సందర్భంగా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు, కోడిపందాలు, పేకాట లాంటివ వాటికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దమ్మున్న నాయకుడు లేరా..? : మాజీ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న బికె. పార్థసారధి

ప్రజాశక్తి రొద్దం

పెనుగొండ నియోజకవర్గంలో వైసిపికి దమ్మున్న ఎమ్మెల్యే అభ్యర్థి దొరకలేదా అని మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి ఎద్దేవా చేశారు. శుక్రవారం మండలంలోని ఆర్. మరవ పల్లిలో జయహో బిసి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి మాట్లాడుతూ పెనుగొండ నియోజకవర్గంలోని ఐదు మండలాలలో వైసిపికి సరైన ఎమ్మెల్యే అభ్యర్థి కన్పించలేదని ఎద్దేవా చేశారు. టిడిపిని ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు స్థానిక నాయకులకు లేకేపోవటంతో వలసపక్షులను తెస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎన్ని వలస పక్షులు వచ్చిన తాము బెదిరేది లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఒక విశ్వవిద్యాలయం లాంటిది అని అన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బిసిలకు రాజకీయ ప్రాధాన్యత, ఆర్థిక వెసులుబాటు కల్పించిన ఘనత టిడిపికి దక్కుతుందన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్య, నాయకులు గంగలకుంట రమణ, పాండురంగప్ప, పోతులయ్య, జనసేన పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కుమార్, శ్రీనివాసమూర్తి, గోవిందప్ప, నరహరి, సిద్దయ్య, లక్ష్మిరెడ్డి, చిన్నప్పయ్య, రొద్దం నరసింహులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడుదామని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు ధర్మవరం నియోజకవర్గ ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు అభివృద్ధి పడకేసిందని విమర్శించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని మరచి అరాచకాలకు పాల్పడుతున్న నాయకులను ఇంటికి సాగనంపుదామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, దేవేందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, రెడ్డప్ప, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

వైసిపితోనే రాష్ట్రభవిష్యత్తు అని మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోనివానవోలు పంచాయతీ పరిధిలోగల బాచనపల్లి ఉగ్రవారంపల్లి తండాల్లో ఆయన స్థానిక వైసిపి నాయకులతో కలసి శుక్రవారం పర్యటించారు. వైసిపి చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి బుల్లెట్ బాబు, స్థానిక నాయకులు రాజేంద్రనాథ్ స్వామి, నార్సింపల్లి శివారెడ్డి, హరినాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి, రాజారెడ్డి, కాంగారెడ్డిపల్లి గోవిందరెడ్డి, విజయసింహారెడ్డి, పాటూరిలక్ష్మీరెడ్డి, శంకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అంగడి నారాయణరెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, జీన వాండ్లపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సంకల్ప ర్యాలీ

ధర్మవరం టౌన్ : మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్ప ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి వన్‌టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తం రెడ్డి, కేత లోకేష్ హాజరయ్యారు. అనంతరం గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ చందమూరి నారాయణ రెడ్డి, టిపిఆర్‌ఒ సుబ్బరాయుడు, మెప్మా సిబ్బంది, వాలంటీర్లు, రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

బుక్కపట్నం : నేటి తరం యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు, టిడిపిసత్య సాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఏపీయూఎస్‌ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు తెలిపారు. వివేకానందుని 162 వ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపీ, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ :పట్టణంలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ మల్లికార్జున ఆధ్వర్యంలో యువజన దినోత్సవ వేడుకలు, వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ జగదీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని బీడుపల్లి సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు . నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుర ప్రముఖులు రత్నాకరం కొండమ రాజు, కల్లుగీత కార్మిక ఫెడరేషన్ కన్వీనర్ తలమర్ల హరికృష్ణ గౌడ్, చిల్డ్రన్స్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ హాజరై ప్రసంగించారు. స్వామి వివేకానందను యువతకు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలను, మెమెంటోలను అందజేశారు. అంతకుమునుపు కొండమ రాజును లాయర్ హరికష్ణను నెహ్రూ యువ కేంద్ర సభ్యులు, కళాశాల అధ్యాపకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సప్తగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సప్తగిరి జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి, యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ గంగిరెడ్డి, ఎస్-ఎస్‌పిఒలు ప్రకాష్, నాగేంద్ర రెడ్డి, అధ్యాపకులు,ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు, విద్యార్థుల పాల్గొన్నారు. అదే విధంగా బిట్ కళాశాలలో యువజనోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.



వివేకానంద విగ్రహం వద్ద నివాళి

చట్టాలపై అవగాహన

రొద్దం : మండలంలోని కలిపి గ్రామంలో అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో సిఇఒ లావణ్య ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సర్పంచి కదిరిమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనంతశక్తి సిఇఒ లావణ్య, మహాశక్తి సిఇఒ రామీజ మాట్లాడుతూ బాల్యవివాహాలు, గృహహింసపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, న్యాయ సలహా కేంద్రం కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బుక్కపట్నం : క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి ఉదయభాస్కర్ తెలిపారు. శుక్రవారం మండలంలో మూడవరోజు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా హై స్కూల్ గ్రౌండ్ నందు వాలీబాల్ క్రికెట్, క్రికెట్ పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పోర్ట్స్ డెవలప్మెంట్ అధికారి మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఇలాంటి క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకొని తమ సత్తా నిరూపించి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పిఇటిలు రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాలు అందజేత

కదిరి టౌన్ : కదిరి డిపోలో ప్రతిభ చూపిన సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం అందజేశారు. కండక్టర్లు వై.చంద్రహాసకు రూ.500, రామాంజులుకి రూ.400, జి.రామక్రిష్ణ కు రూ.300, ప్రొడక్ట్ వారిగా సూపర్ లగ్జరీ సర్వీసుకు భాస్కర్ నాయక్, ఎక్స్-ప్రెస్ లో రామక్రిష్ణ , పల్లె వెలుగు లో కండక్టరు ఆర్.ఆర్. రెడ్డిలకు రూ.100 ల చొప్పున నగదు ప్రోత్సాహాన్నిడిపో మేనేజరు బి.మైనోద్దీన్ అందజేశారు. ఇంధన పొదుపులో అత్యంత ప్రతిభ కనబ రచిన వి.రామక్రిష్ణకు రూ.500, శ్రీరామ నాయక్ రూ.300 అందించారు. ఈ కార్యక్రమంలో కదిరి డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిత, నాయకులు ఎన్‌వి.రమణ, బైరిశెట్టి, శంకరప్ప, శేఖర్, ఈశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు అంబేద్కర్

బత్తలపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బిఆర్ అంబేద్కర్ అందరివాడిగా ఆరాధించబడుతున్నాడని పలువురు అధికారులు కొనియాడారు. శుక్రవారం బత్తలపల్లి మండలంలోని 11 గ్రామ సచివాలయాలలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి మనోహర్‌తో పాటు ఆయా గ్రామ సచివాలయాల అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాస డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపల్ ముసలి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెప్పారు. ఆల్ ఎస్ఇసి కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో మొత్తం 62 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 15 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల ప్లేస్మెంట్ అధికారి బాబా ఫక్రుద్దీన్, కంప్యూటర్ లెక్చరర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు